క్లుప్తంగా

రాజీమార్గంతో కేసులు పరిష్కారం

ఖిలా వరంగల్: జూన్10న వరంగల్ జిల్లా కోర్టులో జాతీయ లోక్ అదాలత్ ఉందని, ఈక్రమంలో స్టేషన్ పరిధిలో ఉన్న కేసులను రాజీ మార్గంలో పరిష్కరించుకునే అవకాశం ఉందని మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ ముస్క శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాది, ప్రతివాదులు ఇరువురు స్టేషన్‌కు వస్తే 10వ తేదీన వారిని కోర్టులో ప్రవేశపెట్టి కేసులను ముగించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ప్రధానంగా యాక్సిడెంట్, కొట్టుకున్న కేసులు, చీటింగ్, చిట్‌ఫండ్, భూ తగాదాలు, వివాహ బంధానికి సంబంధించిన, చిన్న, చిన్న దొంగతనాలు, అక్రమ రవాణా (ఇసుక, మట్టి, కట్టెలు, మద్యం, ఇతర కేసులు), పేకాట, లాక్‌డౌన్, ట్రాఫిక్, ఫ్యామిలీ గొడవలు, గుట్కా వంటి కేసులను లోక్ అదాలత్‌లో రాజీ చేసుకుని కేసులను పరిష్కరించుకోవాలని కోరారు.

'పునీత్ సాగర్'లో నిట్ విద్యార్థులు



కాజీపేట అర్బన్: కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునీత్ సాగర్ అభియాన్ కార్యక్రమంలో నిట్ వరంగల్‌లోని ఎన్‌సీసీ కేడెట్ విద్యార్థులు బుధవారం పాల్గొన్నారు. నిట్ వరంగల్ క్యాంపస్ నుంచి వడ్డెపల్లి చెరువు వద్దకు ర్యాలీగా బయలుదేరి నిట్‌తో పాటు వడ్డెపల్లి పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి హరి, విద్యార్థులు పాల్గొన్నారు.

కుట్టుశిక్షణ, కంప్యూటర్ కోర్సుల్లో మహిళలకు ఉచిత శిక్షణ

కాశిబుగ్గ: నిరుద్యోగ మహిళలకు టైలరింగ్, కంప్యూటర్, వొకేషనల్ కోర్సుల్లో మూడు నెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఇండియన్ సోషల్ సర్వీస్ అధ్యక్షుడు డాక్టర్ వనం భాస్కర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 16నుంచి 35ఏళ్ల మధ్య గల మహిళలు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. మూడు నెలల పాటు ఉచిత భోజన వసతి కల్పించి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 90599 04864, 98494 04864 నంబర్లలో, లేదా కాశిబుగ్గలోని ఇండియన్ సోషల్ సర్వీస్ సెంటర్‌లో సంప్రదించాలని కోరారు.

కుట్టుమిషన్ అందజేత



హన్మకొండ అర్బన్: నగరంలోని మల్లికాంబ మనోవికాస కేంద్రంలో పిల్లలకు ఒకేషనల్ ట్రైనింగ్ నిమిత్తం అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్మన్ డాక్టర్ అనితారెడ్డి కుట్టుమిషన్‌ను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆశ్రమంలోని పిల్లలకు వేసవిలో ఒకేషనల్ ట్రైనింగ్ ఇవ్వడానికి కుట్టు మిషన్ అవసరం ఉందని కేంద్రం నిర్వాహకులు కోరడంతో అందజేసినట్లు తెలిపారు. పిల్లలు దాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మల్లికాంబ మనోవికాస కేంద్రం నిర్వాహకులు రామలీల, కళ్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

బాటసారులకు రాగిజావ పంపిణీ

హన్మకొండ చౌరస్తా: కుశాల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హనుమకొండలోని బస్టాండ్ జంక్షన్‌లో బాటసారులకు బుధవారం రాగిజావ పంపిణీ చేశారు. ఎండలు పెరిగిన నేపథ్యంలో ఉపశమనం కోసం రాగిజావను ఉచితంగా అందజేస్తున్నట్లు కుశాల్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మామిడాల కుశాల్ తెలిపారు.

ఫిర్యాదుదారుడిపై ఎస్సై ఆగ్రహం

ఖిలా వరంగల్: వరంగల్ 36వ డివిజన్ చింతల్‌లో 367 సర్వే నంబర్‌లో ఎకరం 10గుంటల భూమిని కబ్జా చేస్తున్నారని మైదం కృష్ణ ఆరోపించారు. ఈమేరకు భూ కబ్జాదారులపై చర్య తీసుకోవాలని మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు బుధవారం వెళ్లాడు. తన ఫిర్యాదును స్వీకరించకుండా ఎస్సై దురుసుగా ప్రవర్తించారని బాధితుడు ఆరోపించాడు. ఎస్సై తీరుపై సీపీ రంగనాథ్‌కు కృష్ణ ఫిర్యాదు చేయనున్నట్లు తెలిసింది.

నేడు రాష్ట్ర సదస్సు

కేయూ క్యాంపస్: తెలంగాణ రాష్ట్రంలోని కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 8న హైదరాబాద్‌లోని జేఎన్‌టీయూలో నిర్వహించనున్న కాంట్రాక్టు అధ్యాపకుల రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్టు టీచర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ డాక్టర్ శ్రీధర్‌కుమార్ లోథ్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ సదస్సుకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, రిటైర్డ్ జస్టిస్ చంద్రయ్య, ఉస్మానియా యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ రామచంద్రయ్య హాజరవుతారని పేర్కొన్నారు. సదస్సులో కాంట్రాక్టు లెక్చరర్లు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

కేవీలో రంగోళి పోటీలు

కాజీపేట అర్బన్: కాజీపేట మండలం కడిపికొండ గ్రామంలోని కేంద్రీయ విద్యాలయ పాఠశాలలో బుధవారం రంగోళి పోటీలు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం జన్‌భాగీదారీ కార్యక్రమంలో భాగంగా నూతన విద్యావిధానంలో ప్రజల భాగస్వామ్యం, విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు, జీ-20, సేవ్ ఎర్త్, సేవ్ వరల్డ్ పేరిట అందమైన హరివిల్లులను విద్యార్థులు తీర్చిదిద్దారని కేవీ ప్రిన్సిపాల్ మృదుల తెలిపారు.

కొనసాగుతున్న 'బడిబాట'



మాట్లాడుతున్న డీఈఓ అబ్దుల్‌హై

విద్యారణ్యపురి: బడీడు పిల్లలు, బడిబయట పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించే బడిబాట కార్యక్రమం కొనసాగుతోంది. బడిబాట కార్యక్రమంలో భాగంగా హనుమకొండ జిల్లాలో పలుచోట్ల ఉపాధ్యాయులు బుధవారం ర్యాలీలు నిర్వహించారు. ధర్మసాగర్ మండలంలోని పెండ్యాలలో పాఠశాల విద్యాశాఖ ఆర్‌జేడీ సత్యనారాయణరెడ్డి, జిల్లా డీఈఓ ఎండీ.అబ్దుల్‌హై బడిబాట కార్యక్రమంలో భాగస్వాములు అయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన ఊరు – మన బడి ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు వివరించారు. 176 స్కూళ్లకు మొదటి దశలో పెయింటింగ్, డ్యూయల్ డెస్కులు, ఫర్నిచర్, గ్రంథాలయం, డిజిటల్ తరగతుల బోధన, తదితర సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. అలాగే, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఏకరూప దుస్తులు, ఉచిత పాఠ్య పుస్తకాలు, మధ్యాహ్న భోజనం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ విద్యా సంవత్సరంలో ఉదయం అల్పాహారంగా రాగిజావ, నోట్ పుస్తకాలు కూడా అందించబోతున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా వడ్డెరకాలనీ జీరో ఎన్‌రోల్‌మెంట్ పాఠశాలను పునః ప్రారంభించేందుకు సహకరిస్తున్నందుకు ఆ ప్రాంత ప్రజలజీ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్ శ్రీనివాస్, కమ్యూనిటీ మొబిలైజింగ్ కోఆర్డినేటర్ బి.రాధ, సర్పంచ్ లక్ష్మీనారాయణ, ఎంపీటీసీ నాగయ్య, ఎస్‌ఎంసీ బాధ్యుడు కిషోర్, హెచ్‌ఎం పురుషోత్తమ్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లాలో 738మంది విద్యార్థుల చేరిక

జిల్లాలో బుధవారం నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ఒకటవ తరగతిలో 362మంది, 2వ తరగతి నుంచి 12వ తరగతి వరకు 376మంది విద్యార్థులు మొత్తంగా 738మంది విద్యార్థులు ప్రవేశం పొందారని డీఈఓ ఎండీ.అబ్దుల్‌హై, సీఎంఓ బీ.రాధ తెలిపారు. కాగా, ఈనెల 3వ తేదీ నుంచి ఇప్పటివరకు జిల్లాలో మొత్తం 1,900 మంది విద్యార్థులు నూతనంగా ప్రవేశం పొందారని వివరించారు.

పలు కాలనీల్లో ఉపాధ్యాయుల బడిబాట

విద్యారణ్యపురి: హనుమకొండలోని సుబేదారి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు పలు కాలనీల్లో బడిబాట కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. బీఆర్.నగర కాలనీలో ఇంటింటికి వెళ్లి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. ఈ సందర్భంగా కరపత్రాలు పంపిణీ చేశారు. బడిబాట కార్యక్రమంలో టీయూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు నూతనకంటి బాబు, ఉపాధ్యాయురాలు శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

కరీమాబాద్‌లో..

కరీమాబాద్: గ్రేటర్ వరంగల్ పరిధిలోని 40వ డివిజన్ కరీమాబాద్‌లో బుధవారం బడిబాట ర్యాలీ నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ దుర్గం రవి, ఉపాధ్యాయులు శోభారాణి, కల్పన, రాములు, రాజ్యలక్ష్మి, శారద, సునీత, విజయ, అహ్మద్‌పాషా, అరుణ్ పాల్గొన్నారు.

రాంపూర్‌లో..

మడికొండ: కాజీపేట మండలం రాంపూర్ గ్రామంలో బుధవారం బడి బాట కార్యక్రమం నిర్వహించారు. మడికొండ సెక్టర్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లు ర్యాలీ నిర్వహించి బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు శారద, ఉపాధ్యాయులు రవీందర్, సుమ, విద్యార్థులు పాల్గొన్నారు.

బోడగుట్టలో..

కాజీపేట: కాజీపేట 47వ డివిజన్ బోడగుట్ట గ్రామంలో బాలికల ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయులు జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం రఘునాథ రెడ్డి ఆధ్వర్యంలో కరపత్రాలను పంపిణీ చేశారు.

బ్రిజ్‌భూషణ్ సింగ్‌ను వెంటనే శిక్షించాలి



అంబేడ్కర్ కూడలిలో కేంద్రం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు



అలంకార్ జంక్షన్‌లో..

హన్మకొండ: మహిళా రెజ్లర్లను లైంగికంగా వేధించిన బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ చరణ్‌సింగ్‌ను అరెస్టు చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కాసు మాధవి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. సీఐటీయూ హనుమకొండ వెస్ట్ కమిటీ ఆధ్వర్యంలో హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం కూడలిలో బుధవారం రాస్తారోకో చేసి కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. అలాగే, హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో హనుమకొండలోని కాళోజీ కూడలిలోని కాళోజీ విగ్రహం వద్ద ధర్నా చేశారు.

అలంకార్ జంక్షన్‌లో..

హన్మకొండ చౌరస్తా: బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్‌ను తక్షణమే అరెస్టు చేయాలని ఐద్వా జిల్లా కార్యదర్శి దీప కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీఐటీయూ హనుమకొండ నార్త్ కమిటీ ఆధ్వర్యంలో హనుమకొండ అలంకార్ జంక్షన్‌లో బ్రిజ్‌భూషణ్ దిష్టిబొమ్మను బుధవారం దహనం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బ్రిజ్‌భూషణ్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు.

పోచమ్మమైదాన్‌లో..

వరంగల్: బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ సింగ్‌పై చర్యలు తీసుకొని, బాధితులకు న్యాయం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అకినపెల్లి యాదగిరి డిమాండ్ చేశారు. ఈమేరకు సీఐటీయూ వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పోచమ్మమైదాన్ జంక్షన్‌లో రాస్తారోకో నిర్వహించారు.

పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక



మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తాపట్నాయక్

హన్మకొండ అర్బన్ : బీసీ కుల వృత్తులు, చేతి వృత్తుల వారికి ప్రభుత్వం అందించే రూ.లక్ష ఆర్థిక సాయాన్ని 'సంక్షేమ సంబురాలు' సందర్భంగా లాంఛనంగా ప్రారంభించాలని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. మంత్రులు కమలాకర్, హరీశ్‌రావు, సీఎస్ శాంతికుమారి, రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో కలిసి కలెక్టర్లు, అధికారులతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిహించారు. ఈ సందర్భంగా హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ మాట్లాడుతూ లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపడతామని పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ట్రైనీ కలెక్టర్ శ్రద్ధాశుక్లా, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్, డీఎండబ్ల్యూఓ శ్రీను, ఎస్సీ సంక్షేమాభివృద్ధి శాఖ అధికారి నిర్మల, డీటీడబ్ల్యూఓ ప్రేమకళారెడ్డి పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

కరీమాబాద్: రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్‌లతో వారు బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి గంగుల మాట్లాడారు. వీసీలో వరంగల్ జిల్లా నుంచి కలెక్టర్ ప్రావీణ్య పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ శ్రీవత్స, అధికారులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న పిల్లలు, సంస్థ ప్రతినిధులు

హన్మకొండ: పోషకాలతో పాటు పరిశుభ్రంగా వండిన ఆహార పదార్థాలను తినడం వల్ల ఆరోగ్యంతో పాటు వ్యాధుల బారిన పడకుండా జీవించవచ్చని ప్రముఖ సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ అన్నారు. వరల్డ్ ఫుడ్ సేఫ్టీ డే సందర్భంగా 'ఈట్ హెల్తీ.. బీ హెల్తీ' అన్న నినాదంతో ప్రేరణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాలసముద్రం ఏకశిల పార్కులో బుధవారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ రోడ్ల పక్కన శుచి, శుభ్రత పాటించకుండా తయారుచేసే తినుబండారాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ప్రేరణ సంస్థ అధ్యక్షుడు పెండ్లి ఉపేందర్ రెడ్డి, సాగంటి మంజుల, ఏకశిల వాకర్స్, స్థానికులు పాల్గొన్నారు. మొలకెత్తిన గింజలు, చిరుధాన్యాలతో తయారు చేసిన మిఠాయిలు పిల్లలకు పంచారు.

'తెలంగాణ రన్' వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

హసన్‌పర్తి: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో పురస్కరించుకుని ఈనెల 12వ తేదీన వర్ధన్నపేట నియోజకవర్గ కేంద్రంలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 2కే రన్ వాల్‌పోస్టర్లను ఎమ్మెల్యే అరూరి రమేష్ కేఎల్‌ఎన్ గార్డెన్‌లో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12వ తేదీన ఉదయం 6 గంటలకు 2కే రన్ ప్రారంభమవుతుందని వివరించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, జెడ్పీటీసీ సభ్యురాలు రేనుకుంట్ల సునీత, ఎంపీపీలు కేతపాక సునీత, మధుమతి, రైతుబంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ ఎల్లావుల లలితాయాదవ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు విక్టర్‌బాబు, మాజీ సర్పంచ్ రాజేందర్, చుంచు రవి,ఎస్సై దేశిని విజయ్‌కుమార్, క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్లు మాయం



కాలువలో ప్లాస్టిక్ షీట్లు తీసుకుపోతున్న వ్యక్తులు

వరంగల్: వరంగల్ కాకతీయ కెనాల్‌లో లీకేజీలు లేకుండా పటిష్టం చేసేందుకు కోట్లాది రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ షీట్లను యథేచ్ఛగా తీసుకెళ్తున్నా పట్టించుకునే నాథుడే లేకుండా పోయారు. కేయూ క్యాంపస్, గుండ్ల సింగారం ప్రాంతాల్లో కాలువలోని ప్లాస్టిక్ షీట్లను పలువురు బుధవారం తీసుకుపోయారు. ఈ షీట్లు వేసిన సమయంలోనే నీరు విడుదల చేయడంతో నాణ్యతాలోపంతో పెద్ద మొత్తంలో కొట్టుకుపోయాయి. ప్రస్తుతం వేసవికాలం కావడంతో నీటి విడుదల నిలిపివేయడంతో కాలువ పూర్తిగా ఎండిపోయాయి. దీంతో ప్లాస్టిక్ షీట్లు కాలువలో ప్రత్యక్షం కావడంతో చుట్టు పక్కల ప్రజలు తీసుకుపోతున్నారు. నీటిపారుదల శాఖ అధికారులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో అన్నప్రాసన



అన్నప్రాసన కార్యక్రమంలో సీడీపీఓ విశ్వజ

ఖిలా వరంగల్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా వరంగల్ 33వ డివిజన్ వరంగల్ రైల్వే గేట్ పెరకవాడలోని అంగన్‌వాడీ సెంటర్‌లో ఐసీడీఎస్ వరంగల్ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ బత్తిని రమాదేవి ఆధ్వర్యంలో కార్పొరేటర్ ముస్కమల్ల అరుణ నేతృత్వంలో చిన్నారులకు బుధవారం అన్నప్రాసన, అక్షరాభ్యాసం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ విశ్వజ మాట్లాడుతూ చిన్నారులకు ప్రభుత్వం అందించే పోషకాలను పంపిణీ చేయాలని సూచించారు. పిల్లలకు ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆటపాటలతో కూడిన చక్కటి విద్యను అందించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సుజన, బత్తిని రమాదేవి పాల్గొన్నారు.

చెరువుల పండుగను విజయవంతం చేయాలి

కరీమాబాద్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం ఉర్సు చెరువు వద్ద నిర్వహించనున్న చెరువుల పండుగను విజయవంతం చేయాలని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి కోరారు. ఈమేరకు కార్యక్రమం నిర్వహణపై ఉర్సు సీఆర్సీ భవన్‌లో బుధవారం చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువు కట్టపై రంగవల్లులు వేయడం, డప్పుచప్పుల్లతో బతుకమ్మ, బోనాల ఊరేగింపు ఉంటుందని వివరించారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో భోజన సదుపాయం ఉంటుందని చెప్పారు. ప్రజలు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జీడబ్ల్యూఎంసీ డీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్‌ఓ సుదర్శన్, సీఓ సునీత, సూపర్‌వైజర్ మాధవి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కేటీఆర్‌ను కలిసిన కలెక్టర్లు







మంత్రి కేటీఆర్‌తో మాట్లాడుతున్న కలెక్టర్లు, పూలమొక్క అందజేస్తున్న మేయర్, కమిషనర్

కరీమాబాద్: రాష్ట్ర పురపాలక, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్‌ను హనుమకొండ, వరంగల్ కలెక్టర్లు సిక్తా పట్నాయక్, ప్రావీణ్య బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. గూడెప్పాడు సమీపంలోని ఎస్‌ఎస్‌ఆర్ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి కుమార్తె రిసెప్షన్‌కు హాజరైన సందర్భంగా మంత్రికి కలెక్టర్లు పుష్పగుచ్ఛాలు అందజేశారు.

మంత్రి కేటీఆర్‌ను కలిసిన కమిషనర్

వరంగల్ అర్బన్: మంత్రి కేటీఆర్‌ను గ్రేటర్ వరంగల్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా మర్యాద పూర్వకంగా కలిశారు. మలుగు పర్యటనకు హాజరైన మంత్రికి కమిషనర్ పూలమొక్క అందజేశారు. అలాగే, నగర మేయర్ గుండు సుధారాణి కూడా మంత్రిని కలిసి పూలమొక్క అందించారు.

సేవాగుణంతో అనాథాశ్రమం ఏర్పాటు



మాట్లాడుతున్న పాపారావు, వేదికపై ప్రతినిధులు

హన్మకొండ అర్బన్: భోగవల్లి రాజేశ్వర్‌రావు సేవాగుణం స్ఫూర్తితో అనాథాశ్రమం ఏర్పాటు చేస్తున్నట్లు రెడ్‌క్రాస్ సొసైటీ మాజీ చైర్మన్ బీవీ.పాపారావు అన్నారు. హనుమకొండ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో భోగవల్లి రాజేశ్వర్‌రావు ట్రస్ట్ సహకారంతో ఏర్పాటు చేయనున్న అనాథాశ్రమం ఏర్పాటుకు సంబంధించిన ఒప్పందాన్ని ఇరువురు ఖరారు చేసుకున్నారు. ఈ సందర్భంగా పాపారావు, కలెక్టర్, రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షురాలు సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ ఈ అనాథాశ్రమం ద్వారా అనాథపిల్లలకు విద్య, వైద్యం, వసతి సౌకర్యం పూర్తిగా ఉచితంగా అందించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో తెలంగాణ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్, మాజీ ఐఏఎస్ అజయ్‌మిశ్రా, ప్రధాన కార్యదర్శి కె.మదన్ మోహన్‌రావు, ఎంఎంయూ స్టేట్ చైర్మన్ స్వర్ణలత, వైస్ చైర్మన్ పెద్ది వెంకట నారాయణ గౌడ్, కోశాధికారి బొమ్మినేని పాపారెడ్డి, రాష్ట్ర పాలకవర్గ సభ్యులు ఈ.వి శ్రీనివాస్‌రావు, జిల్లా పాలకవర్గ సభ్యులు పుల్లూరు వేణుగోపాల్ పాల్గొన్నారు.

డంపింగ్ యార్డును తరలించే వరకు ఉద్యమిస్తాం



డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న రాకేష్‌రెడ్డి

మడికొండ: మడికొండలోని డంపింగ్ యార్డు నుంచి వచ్చే పొగతో చుట్టుపక్కల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దాన్ని అక్కడి నుంచి వేరే చోటుకు తరలించే వరకు బీజేపీ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల రాకేష్‌రెడ్డి హెచ్చరించారు. మడికొండ డంపింగ్ యార్డును పార్టీ నాయకులతో కలిసి రాకేష్‌రెడ్డి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారం రోజులుగా డంపింగ్ యార్డు నుంచి వస్తున్న పొగతో పరిసర ప్రాంతాల ప్రజలు శ్వాసకోస సంబంధ సమస్యలతో బాధపడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈక్రమంలో డంపింగ్ యార్డు నగరానికి దూరంగా, జన సమర్థంలేని ప్రాంతానికి తరలించాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు గడ్డం మహేందర్, బీజేవైఎం జిల్లా కార్యదర్శి పల్లపు అశోక్, వల్లెపు రాజు, ఎత్తరి ప్రేమ్‌రాజ్, శివశంకర్, ఎత్తరి అనిల్, పవన్, కార్తీక్, శివ, చరణ్, తదితరులు పాల్గొన్నారు.

'ప్రజాగర్జన'ను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న రవి



సమావేశంలో మాట్లాడుతున్న కర్రె భిక్షపతి

ఖిలా వరంగల్: ఈనెల 11న భద్రాద్రి కొత్తగూడెంలో సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించనున్న సీపీఐ మహాగర్జన సభను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి, సహాయ కార్యదర్శి షేక్ బాష్‌మియా పిలుపునిచ్చారు. ఈమేరకు వరంగల్ శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో బుధవారం జరిగిన సమావేశంలో మహాగర్జన సభ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి పనాస ప్రసాద్, సభ్యులు గన్నారపు రమేష్ భద్రి, ఎలేందర్ పాల్గొన్నారు.

మడికొండ: ఈనెల 11న కొత్తగూడెంలో జరగనున్న ప్రజాగర్జన సభకు వేలాదిగా కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి పిలుపునిచ్చారు. కాజీపేట మండలం రాంపూర్‌లోని ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకుని నివాసముంటున్న ప్రజలతో బుధవారం ఆయన మాట్లాడారు. పార్టీ కాజీపేట మండల కార్యదర్శి మునిగాల భిక్షపతి, జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, కాజీపేట మండల సహాయ కార్యదర్శి మాలోతు శంకర్, పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

పద్మశాలీల ఐక్యతకు సభ్యత్వ నమోదు

వరంగల్: తెలంగాణలోని పద్మశాలి కులబాంధవుల ఐక్యత కోసం చేపట్టిన సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని పద్మశాలి సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ వద్నాల నరేందర్ సూచించారు. 21వ డివిజన్ ఎల్‌బీనగర్ పద్మశాలి సేవా సంఘ ట్రస్ట్ అధ్యక్షుడు సుంకనపెల్లి శ్రీనివాస్ అధ్యక్షతన బుధవారం జరిగిన సమావేశంలో పరపతి సంఘం సభ్యులు సభ్యత్వాలు స్వీకరించారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘాల నాయకులు గోరంటల రాజు, గోసికొండ సుధాకర్, అకెనె వెంకటేశ్వర్లు, మురళీకృష్ణ, మార్గం ఎల్లయ్య, ప్రభాకర్, బింగి మహేష్, బైరి సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభా పురస్కారాల ప్రదానం

న్యూశాయంపేట: ఇటీవల ప్రకటించిన పదవ తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వరంగల్ జిల్లా పరిధిలోని మైనారిటీ గురుకులాలకు చెందిన ముగ్గురు విద్యార్థులకు పీఆర్టీయూ టీఎస్ యూనియన్ ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఈమేరకు 10జీపీఏ సాధించిన వరంగల్(బీ)-1 గురుకులానికి చెందిన ఈ.సాయిరామ్, వరంగల్(జీ-2)కు చెందిన సాత్విక, 9.8 జీపీఏ సాధించిన వర్ధన్నపేట(బీ-1)కి చెందిన ఏ.విష్ణుకు పురస్కారాలతో పాటు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవీందర్‌రెడ్డి, పట్టాభిలతో పాటు ప్రిన్సిపాళ్లు భిక్షపతి, సుంకన్న, మాధవి పాల్గొన్నారు.

సంకటహర చతుర్థి పూజలు



కాజీపేట: సంకటహర చతుర్థి పూజలను పురస్కరించుకుని కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో స్వామి వారికి బుధవారం సహస్ర జలాభిషేకం జరిపించారు. వేసవి ఎండలు మండిపోతున్న నేపథ్యంలో ఎండ తాపం తగ్గి వర్షాలు సమృద్ధిగా కురవాలని ఆకాంక్షిస్తూ జలాభిషేకం నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకుడు అయిన వోలు అనంతమల్లయ్య శర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో అర్చకులు ప్రత్యేక హోమం, పూజలు చేశారు. అనంతరం అన్నపూర్ణ భవనంలో భక్తులందరికి అన్నదానం చేశారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కాజీపేట: కాజీపేట 47వ డివిజన్ బాపూజీనగర్ కాలనీకి చెందిన శివశంకర్ అనే యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కాగా, బాధిత కుటుంబాన్ని డీసీసీబీ మాజీ చైర్మన్ జంగా రాఘవరెడ్డి బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి నివాళులు అర్పించారు. బాధితుడు బీజేపీ జిల్లా నాయకుడు ఉడుతల బాబురావుకు ధైర్యం కల్పించారు. కార్యక్రమంలో సయ్యద్ రజాలీ, గుర్రపు కోటేశ్వర్‌రావు, బోయిని కుమార్‌యాదవ్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

రైలునుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

కాశిబుగ్గ: ఇంటికన్నె – నెక్కొండ రైల్వే స్టేషన్ల మధ్య ఇంటికన్నె రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి ప్రమాదవశాత్తు రైలులో నుంచి జారిపడి మృతి చెందాడని జీఆర్పీ సీఐ నరేష్ బుధవారం తెలిపారు. 30 – 35 ఏళ్ల మధ్య వయస్సు గల వ్యక్తి మృతదేహాన్ని వరంగల్ ఎంజీఎం మార్చురీలో భద్రపచినట్లు పేర్కొన్నారు. డిప్యూటీ ఎస్‌ఎస్ ఫిర్యాదు మేరకు రైల్వే హెడ్ కానిస్టేబుల్ భాస్కర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. పూర్తి వివరాలకు 94403 61941, 87126 58585 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

మినార్ టీ ప్యాలెస్ ప్రారంభం

హన్మకొండ చౌరస్తా: హనుమకొండలోని జిల్లా గ్రంథాలయం సమీపంలో ఏర్పాటు చేసిన మినార్ టీ ప్యాలెస్ షాపును డీసీసీ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం ఉన్నంత కాలం ప్రభుత్వ ఉద్యోగాలు రావని గ్రహించిన యువత.. స్వయం ఉపాధి దిశగా అడుగులు వేస్తోందని ఎద్దేవాచేశారు. అనంతరం రాజేందర్‌రెడ్డిని టీ ప్యాలెస్ నిర్వాహకులు రాంబాబు, సూరి, కోటి, రాజేష్ సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మీర్జా అజీజుల్లా, సతీష్, రాజు, రాహుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు 'భారత్ బచావో' సదస్సు



మాట్లాడుతున్న రామబ్రహ్మం

నయీంనగర్: ఈనెల 9న భారత్ బచావో ఉమ్మడి వరంగల్ జిల్లా సదస్సును హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించనున్నట్లు భారత్ బచావో చైర్మన్ ఎస్.రామబ్రహ్మం తెలిపారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో స్వేచ్ఛ, సమానత్వం, లౌకికవాదం ప్రమాదంలో పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. సదస్సుకు ప్రొఫెసర్ హరగోపాల్, జేబీ రాజు, జహీర్ అలీఖాన్, రమేష్ పట్నాయక్ హాజరై వివిధ అంశాలపై ప్రసంగించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కె.వేణుగోపాల్‌రెడ్డి, ఓంబ్రహ్మం, రవీందర్, సదానందం, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వరంగల్ అర్బన్:
9951602875 9505507575
9010299096 9553955722
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎల్. రాకేష్ వర్మ (SR) : 9885438059 (హన్మకొండ)
పి.చంద్రశేఖర్ (ACO) : 8074606274 (వరంగల్)
జి. రవియాదవ్ (ACO) : 9032782191 (హన్మకొండ)